క్లుప్తంగా

ఉత్తమ వీఆర్వోగా విష్ణుమూర్తి


ఉత్తమ సేవా అవార్డు స్వీకరిస్తున్న వీఆర్వో విష్ణుమూర్తి

రామచంద్రపురం రూరల్: జిల్లా ఉత్తమ వీఆర్వోగా రామచంద్రపురం మండలం చోడవరం వీఆర్వో పంపన విష్ణుమూర్తి ఎంపికయ్యారు. ఈ మేరకు అమలాపురంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్‌ల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. వీఆర్వోను ఆర్డీఓ ఎస్.సుధాసాగర్, తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ తదితరులు అభినందించారు.

అంగరలో రక్తదాన శిబిరం


శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకుడు


కపిలేశ్వరపురం: అంగరలో ప్రేమస్ఫూర్తి సహాయ పరిచర్య, కాకినాడ యువసేన బ్లడ్ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక గాంధీ సెంటర్‌లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 20 మంది రక్తదానం చేశారు. శిబిరంలో పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగుమళ్ల రాంబాబు, యువసేన బ్లడ్ బ్యాంక్ నాయకులు డాక్టర్ సతీష్, ట్రస్ట్ వ్యవస్థాపకులు కొండిపూడి సుబ్రహ్మణ్యం, బళ్ల నవజీవన్ రాజేష్‌కుమార్, బొప్పే సత్యనారాయణ, తాళ్ల కుమార్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవాళి అభ్యున్నతికి క్రీస్తు బోధనలు


సీనియర్ పాస్టర్లను సత్కరిస్తున్న ఫెలోషిప్ పాలకవర్గ సభ్యులు

కపిలేశ్వరపురం: ప్రపంచ మానవాళి అభ్యున్నతికి క్రీస్తు బోధనలు దోహదపడతాయని మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు డాక్టర్ జి.రూబెన్, గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.ఏసురత్నం అన్నారు. స్థానిక ఫెలోషిప్ భవనంలో గురువారం ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. క్రైస్తవ సంఘాల నిర్వహణ, ప్రాపంచిక పరిస్థితులపై చర్చించారు. ఈ సందర్భంగా సీనియర్ పాస్టర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎం.డేవిడ్‌రాజు, కార్యదర్శి కిరణ్‌పాల్, కోశాధికారి ఇమ్మానుయేల్, చీఫ్ ప్యాట్రన్ నానిబాబు, సహాయ కార్యదర్శి బర్నాబాస్, రికార్డింగ్ సెక్రటరీ ప్రసాద్ మాట్లాడారు.

సామాజికవేత్తకు అల్లూరి అవార్డు


కుమార్‌కు అల్లూరి రజతోత్సవ అవార్డును అందజేస్తున్న దుళ్ల వెంకటేశ్వరరావు

రావులపాలెం: ప్రముఖ సామాజికవేత్త ఐఈ కుమార్‌కు విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా సంస్థ రజతోత్సవ అవార్డును గురువారం అందించింది. ఊబలంకలో సంస్థ ఆవిర్భవించి నేటికి 25 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని అల్లూరి సీతారామరాజు జాతీయ సేవా సంస్థ రజతోత్సవ అవార్డును సంస్థ ఫౌండర్ దుళ్ల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సామాజికవేత్త, అన్నా మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు ఐఈ కుమార్‌కు ప్రదానం చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐఈ కుమార్ గతంలో ఊబలంక మండల పరిషత్ ఎలిమెంటరీ పాఠశాలకు సుమారు రూ. 10 లక్షలు విరాళంగా ఇచ్చారన్నారు. అన్నా మినిస్ట్రీస్ సంస్థను ప్రారంభించి 30 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని గుర్తు చేశారు.

సేవలతో ప్రజల్లో గుర్తింపు

మామిడికుదురు: విధి నిర్వహణలో ఉత్తమ సేవలతో ప్రజల్లో గుర్తింపు లభిస్తుందని నగరం ఎస్సై చైతన్యకుమార్, పి.గన్నవరం ఎస్సై శివకృష్ణ అన్నారు. నగరం ఎస్సైగా విధులు నిర్వహించి మలికిపురం బదిలీ అయిన పి.సురేష్ వీడ్కోలు సభ బుధవారం రాత్రి నగరం పోలీస్ స్టేషన్‌లో జరిగింది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎస్సైను ఘనంగా సన్మానించారు. సురేష్ విధి నిర్వహణలో ప్రజల మన్ననలు అందుకున్నారని కితాబిచ్చారు. పి.గన్నవరం నియోజకవర్గ సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, ప్రముఖులు కటకంశెట్టి ఆదిత్య, కొమ్ముల రాము, బొలిశెట్టి భగవాన్, మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజు పాల్గొన్నారు.


రామచంద్రపురంలో విద్యార్థులకు స్వీట్లు అందిస్తున్న ఆర్డీఓ సుధాసాగర్



గొల్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న అధికారులు, నాయకులు


కె.గంగవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ సూర్యారావు


ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ వద్ద జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎస్సై లక్ష్మణ్


రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న స్థానిక నాయకులు

మహనీయుల త్యాగం.. స్వాతంత్ర్యం

- దేశభక్తి ఉప్పొంగేలా జెండా పండగ
- త్యాగధనులను స్మరించుకుంటూ వేడుకలు
- రెపరెపలాడిన మువ్వన్నెల జెండా


అమలాపురంలో ప్రశంసా పత్రాలను అందుకుంటున్న గౌతమి పాఠశాల విద్యార్థులు



రామచంద్రపురం బార్ అసోసియేషన్‌లో రాజ్యాంగ పుస్తక ప్రతులను ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తులు

రామచంద్రపురం: మువ్వన్నెల జెండా రెపరెపలాడింది.. ప్రతి గుండెలోనూ దేశభక్తిని నింపింది.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో గురువారం వేడుకలు జరుపుకొన్నారు. స్వతంత్రం తీసుకురావడంలో అమరులైన త్యాగధనుల స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు అన్నారు. రామచంద్రపురం కోర్టుల ఆవరణలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆవరణలో అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ జాతీయ పతాక ఆవిష్కరణ చేశారు. అసోసియేషన్ హాల్లో జరిగిన సభలో జూనియర్ సివిల్ జడ్జి నిజామ్ శారద మాట్లాడుతూ రాజ్యాంగాన్ని గౌరవించడమే దేశభక్తికి తార్కాణమన్నారు. న్యాయవాది ఎంవీ సుబ్బారావు అందజేసిన రాజ్యాంగ పుస్తక ప్రతులను న్యాయమూర్తులు ఆవిష్కరించారు. న్యాయవాదులంతా చదువుకునేందుకు వీలుగా ఈ పుస్తకాలను బార్ అసోసియేషన్ లైబ్రరీలో అందుబాటులో ఉంచుతామని అధ్యక్షుడు పిల్లి మురళి తెలిపారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు డీఎస్ఎస్ శర్మ, పలివెల సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద ఆర్డీఓ ఎస్.సుధాసాగర్, పోలీస్ స్టేషన్ వద్ద సీఐ కె.అశోక్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. శ్రీసిద్ధి వినాయక ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పురపాలక సంఘ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కమిషనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు. మోడరన్ విద్యా సంస్థలు, పీఎస్ఎం, వికాస్ తదితర విద్యా సంస్థల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించారు.

విద్యార్థులకు మంత్రి ప్రశంసలు

మండపేట: ఏపీ బయో డైవర్సిటీ బోర్డ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్, ఏపీ ఎస్‌జీసీ సంస్థ సంయుక్తంగా ఇటీవల నిర్వహించిన షార్ట్ ఫిల్మ్ పోటీల్లో పట్టణంలోని శ్రీగౌతమి మున్సిపల్ పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమలాపురం పెరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, డీఈఓ ఎం.కమలకుమారి, జిల్లా సైన్సు అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కె.సాయిరాం చేతుల మీదుగా విద్యార్థులు కీర్తి శివదేవి, ఐశ్వర్య, అమృత, రమ్య, గైడ్ టీచర్ రామలక్ష్మిలు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. విద్యార్థులను ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరావు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, ఎంఈవో నాయుడు రామచంద్రరావు అభినందించారు.

కాజులూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై తులసీరామ్, కాజులూరు లేబర్ కాంట్రాక్ట్ సొసైటీ వద్ద సొసైటీ కార్యదర్శి పెంకే సత్యనారాయణ మువ్వన్నెల జెండాలను ఆవిష్కరించారు. గొల్లపాలెంలో జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

కె.గంగవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ పంపన నాగమణి జెండా ఆవిష్కరించారు. ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, బీసీ నాయకుడు పంపన సుబ్బారావు పాల్గొన్నారు.


మండపేటలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న పృథ్వీరాజ్ తదితరులు

కె.గంగవరం పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై జానీబాషా, రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ కె.సూర్యారావు, ఎమ్మార్సీ వద్ద ఎంఈఓ నాగరాజు పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. కూళ్ల, పామర్రు, భట్లపాలిక తదితర గ్రామాల్లోని పంచాయతీల వద్ద వేడుకలు జరిగాయి.

రామచంద్రపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అంబటి భవాని జాతీయ జెండా ఎగురవేశారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, ఎంపీడీఓ ఎన్వీ రామచంద్రమూర్తి, ఈఓపీఆర్డీ ఎన్.సెలత్‌రాజు, పంచాయతీ రాజ్ ఏఈ యేసురత్నం, మండల పరిషత్ సిబ్బంది, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వీం.వెంకటేశ్వరరావు జెండా ఎగురవేశారు. ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

మహనీయుల బాటలో పయనిద్దాం

రాయవరం: స్వాతంత్ర్య ఫలాలు సమాజంలో ఉన్న అన్ని వర్గాల వారికి అందాలంటే మహనీయులు చూపిన బాటలో పయనించాలని రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ పిలుపునిచ్చారు. మండలంలో గురువారం 78వ స్వాతంత్ర్య వేడుకలు మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వాతంత్రోత్సవ వేడుకల్లో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ప్రముఖ వైద్యులు డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి, డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి, పడాల వెంకటరామారెడ్డి, యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి, వుండవిల్లి రాంబాబు, తెంటు సత్యనారాయణ, అల్లూరి శ్రీనివాసచౌదరి మల్లిడి రుద్రారెడ్డి, తాడి రామచంద్రారెడ్డి, పడాల కమలారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పలువురు దాతలు మెరిట్ విద్యార్థులకు మెమెంటోలు, నగదు బహుమతులు అందజేశారు.

మండపేట: మండపేట పట్టణం, మండలంలోని 12 గ్రామాల్లో గురువారం 78వ స్వాతంత్ర్య వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, వాణిజ్య వ్యాపార కార్యాలయాలు వద్ద జెండాను ఆవిష్కరించారు. పలు చోట్ల ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పాల్గొని స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను కొనియాడారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ బొడ్డేపల్లి రాము, చైర్‌పర్సన్ దుర్గారాణి జాతీయ జెండా ఎగురవేశారు. పట్టణంలోని ఏడిద రోడ్డు, మెయిన్ రోడ్డు, బస్ స్టాండ్ సెంటర్ల వద్ద ఆటో యూనియన్ స్టాండ్లలో ఆటో డ్రైవర్లు స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరిలు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

మువ్వన్నెల జెండా రెపరెపలు


కపిలేశ్వరపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద జెండా వందనం వేడుకల్లో ఎంపీపీ, జెడ్పీటీసీ

కపిలేశ్వరపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీడీఓ కొండలరావు తదితరులు పాల్గొని మాట్లాడుతూ మహనీయుల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పాఠశాలల విద్యార్థులు భరతమాత, గాంధీ, సుభాష్ చంద్రబోస్ తదితర మహనీయుల వేషధారణలో అలరించారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రకాష్, సాకా శ్రీనివాస్, సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, వీధి వెంకటరెడ్డి, కుక్కల వీరన్న, ఎంపీటీసీ సభ్యులు పలివెల మధు, శీలం భాస్కరరావు, మేడిశెట్టి దుర్గారావు, అద్దాల శ్రీనివాస్, యర్రంశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు



అవార్డు అందుకుంటున్న ఎంఈఓ నాయుడు రామచంద్రరావు, తాపేశ్వరం కార్యదర్శి శ్రీనివాస్, రైతుబజార్ ఎస్టేట్ అధికారి సతీష్, సచివాలయ అడ్మిన్ శ్రీసత్య హరిత

మండపేట: విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన అధికారులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. అమలాపురంలో గురువారం నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌ల చేతుల మీదుగా పురస్కార గ్రహీతలు ప్రసంశా పత్రాలను అందుకున్నారు. మున్సిపల్ డీఈ కె.శ్రీనివాస్, ఎంఈఓ నాయుడు రామచంద్రరావు, తాపేశ్వరం గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, రైతు బజార్ ఎస్టేట్ అధికారి సతీష్, పట్టణంలోని 3వ సచివాలయం అడ్మిన్ గుణ్ణం శ్రీసత్య హరిత పురస్కారాలను అందుకున్నారు. వారిని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, ఎంపీడీవో శ్రీదేవి, ఈవోపీఆర్డీ ఐదం రాజు, మున్సిపల్ కమిషనర్ బి.రాము, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సహచర ఉద్యోగులు అభినందించారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

కాజులూరు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ గురువారం కుయ్యేరులో పలువురు ఎస్సీ నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు. మండల ఎస్సీ సెల్ కార్యదర్శి, మాజీ సర్పంచ్ పోతుల మాధవ ఆధ్వర్యంలో ఎస్సీపేట అంబేడ్కర్ మందిరం వద్ద నల్ల జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాధవ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రావడంతోనే ఎస్సీ వర్గీకరణ రగడ రాజుకుందన్నారు. అన్నదమ్ముల్లా ఉన్న కులాల మధ్య సీఎం చంద్రబాబు చిచ్చుపెట్టారన్నారు. మాల మహానాడు ఆదేశాల మేరకు ఎస్సీ వర్గీకరణపై పాలకుల నిర్ణయాలను వ్యతిరేకిస్తూ గురువారం బ్లాక్‌డేగా భావించి అంబేడ్కర్ మందిరాల వద్ద నల్లజెండాను ఎగుర వేశామన్నారు. ఎస్సీ నాయకులు పందిరి శ్రీను, బచ్చల సూరిబాబు, గొల్లపల్లి కాసుబాబు, కాటే నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మండపేట: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మండలంలోని ఏడిద, కేశవరం గ్రామాల్లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ×వర్గీకరణ వద్దు – రాజ్యాంగమే ముద్దు× అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో గంటా భాస్కరరావు (బాసి), బూరిగ శ్రీనివాసరావు, నందికోళ్ల వెంకట్రావు, బూరిగ జాని, గుమ్మడి విజయ్ కుమార్, బూరిగ శ్రీనివాసరావు పాల్గొన్నారు. కేశవరంలో యడ్ల రవి మాట్లాడుతూ వర్గీకరణ అనుకూల తీర్పును నిరసిస్తూ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయనున్నామన్నారు.


కుయ్యేరులో ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ నల్లజెండా ఆవిష్కరించిన నాయకులు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 333/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ డీఈ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. గురువారం గొల్లపాలెం మెయిన్ సబ్ స్టేషన్ ఏఈ ఎం సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సబ్ స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు. కుయ్యేరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో దుగ్గుదుర్రు, కుయ్యేరు, రేగుబడవ, చింతలంక, ఉప్పుమిల్లి తదితర గ్రామాలు, 11 కేవీ ఇండస్ట్రీయల్ ఫీడర్‌లోని దుగ్గుదుర్రు, కుయ్యేరు, పల్లిపాలెం, ఉప్పుమిల్లి గ్రామాల్లో ఇండస్ట్రీయల్, ఆక్వా చెరువులకు, గొల్లపాలెం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధి శీల ఫీడర్‌లోని శీల, మంజేరు, శీలలంక, ఒంటితాడి, శలపాక, తణుకువాడ, మొగలిపాలెం గ్రామాల గృహావసర వినియోగదారులకు సరఫరా ఉండదన్నారు.

అపూర్వ కలయిక

మలికిపురం: స్థానిక ఏఎఫ్‌డీటీ ఉన్నత పాఠశాలలో 1978–77లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం గురువారం జరిగింది. అలనాటి జ్ఞాపకాలను వారంతా నెమరవేసుకుని సందడి చేశారు. వారంతా చందాలు వేసుకుని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన రూ. లక్ష ద్వారా నెల నెలా వచ్చే వడ్డీతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ఈ ఏడాది ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గురు విద్యార్థులకు నగదు సాయం అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, పెద్దలు డాక్టర్ రుద్రరాజు పద్మరాజు, మంగెన వెంకట సత్యనారాయణ మూర్తి, డి.శ్రీహరిరాజు, దివ్వి సత్యనారాయణ, కడలి సత్యనారాయణ, కాదులూరి రామకృష్ణ, సత్యానందం, కడలి కృష్ణార్జునుడు, మానేపల్లి సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


మలికిపురంలో కలుసుకున్న 1976-77 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

మోతాదు మించితే అనర్థమే..

- విచక్షణా రహితంగా ఎరువులు వాడొద్దు
- వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి

కె.గంగవరం: పంట దిగుబడుల్లో ఎరువుల పాత్ర చాలా కీలకం. వరి పంటలో విచక్షణా రహితంగా ఎరువులు వాడితే ప్రమాదకరం. అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మితిమీరి వాడడంతో పంటలపై చీడపీడలు విజృంభించే ప్రమాదం ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 21,688 హెక్టార్లలో వరి సాగు జరుగుతోంది. ఇందులో కె.గంగవరం మండలంలో 6,344 హెక్టార్లు, కాజులూరు మండలంలో 7,702, రామచంద్రపురం మండలంలో 7,642 హెక్టార్లలో పంట సాగు చేస్తున్నారు.

ప్రతి పంటకు నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి స్థూల పోషకాలతో పాటు జింక్, మెగ్నీషియం, బోరాన్, కాల్షియం, సల్ఫర్ వంటి ఇతర పోషకాలు చాలా అవసరం. ప్రస్తుతం రైతులకు రసాయన ఎరువుల వినియోగంపై సరైన అవగాహన లేకపోవడం, పరసర ప్రాంత రైతుల మధ్య నెలకొన్న పోటీతత్వం కారణంగా అవసరానికి మంచి ఎరువులు వాడుతున్నారు. దీంతో సాగు ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు చీడపీడలు విజృంభించి జింక్, ఇనుము వంటి సూక్ష్మ పోషక లోపాలు ఎక్కువ కావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఇటువంటి తరుణంలో ఎరువుల వాడకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

ఎకరానికి ఎంతంటే..

ఎకరం వరి పంటకు 72 కిలోల నత్రజని, 36 కిలోల భాస్వరం, 24 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు అవసరం. ఎకరం విస్తీర్ణంలో వరికి మొదటి దఫా సిఫారసు చేసిన మొత్తం భాస్వరాన్ని దమ్ములో వేసుకోవడం వల్ల త్వరగా మూన తిరిగి దుబ్బు ఎక్కువగా చేస్తుంది. నత్రజని ఎరువును మూడు సమభాగాలుగా చేసి మొదటి దఫా నాట్లు వేసే సమయంలోనూ, రెండో దఫా పిలకలు కట్టే దశలో వేయాలి. పొటాష్ ఎరువును రెండు భాగాలుగా చేసి మొదటి దఫా నాట్లు వేసే సమయంలో, మిగిలిన సగం అంకురం ఏర్పడే దశలో వేసుకోవాలి. సూటి ఎరువుల రూపంలో ఎకరాకు 157 కిలోల యూరియా, 200 కిలోల సింగల్ సూపర్ ఫాస్ఫేట్, 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ అవసరమవుతాయి.

నత్రజని వాడకం ఇలా..

నత్రజని ఎరువు సమర్థవంతంగా పని చేయాలంటే బురద పదునుపై చల్లి 48 గంటల తరువాత నీరు పెట్టాలి. 50 కిలోల యూరియాకు 10 కిలోల వేప పిండి లేదా 250 కిలోల తేమ కలిగిన మట్టి కలిపి రెండు రోజులు నిల్వ ఉంచిత తరువాత పొలంలో చల్లుకోవడం వల్ల నత్రజని వినియోగం పెరిగి మొక్క ధృఢంగా పెరుగుతోంది.

పైరులో సూక్ష్మపోషక లోపాలు

ప్రధానంగా జింక్ లోపం వల్ల నాట్లు వేసిన తరువాత మొక్కపై నుంచి 3 లేదా 4 ఆకుల మధ్య ఈనె తెల్లగా పాలిపోతుంది. మధ్య ఈనె ముందుగా ఆకుపచ్చ నుంచి పసుపు రంగుకు, తరువాత తెలుపు రంగుకు మారుతుంది. జింక్ లోపం ఆశించిన ఆకులు చిన్నవిగా, పెళుసుగా ఉండి శబ్దం వస్తూ విరిగిపోతాయి.

జింక్ లోపం నివారణకు నాట్లు వేసిన 2 నుంచి 5 వారాల మధ్య పొలంలోని పాత నీటిని తీసివేసి కొత్త నీటిని పెట్టాలి. తరువాత లీటరు నీటికి 2 గ్రాముల జింక సల్ఫేట్ కలిపి పైరంతా తడిచేలా పిచికారీ చేయాలి. ఐదు రోజుల వ్యవధిలో రెండు మూడు పర్యాయాలు పిచికారీ చేయడం వల్ల లోపాన్ని పూర్తిగా నివారించవచ్చు.


కె.గంగవరంలో వరి పంట

దిగుబడులపై ప్రభావం



ప్రస్తుతం రైతులకు సరైన అవగాహన లేక ఎక్కువగా ఎరువులు వాడుతున్నారు. పంట దిగుబడి ఎక్కువగా పొందాలనే తపనతో అధిక ఎరువుల వాడకం వల్ల లాభం కంటే నష్టమే ఎక్కువ. ఖర్చు పెరగడమే కాక చీడపీడలు ఆశించి దిగుబడులు తగ్గిపోయే ప్రమాదముంది. వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనల మేరకు ఎరువులు వినియోగిస్తే మంచిది.

–బలుసు రవి, మండల వ్యవసాయ అధికారి

వెంకన్న ఆలయానికి విరాళాల వెల్లువ


దాతలకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ కిశోర్‌కుమార్

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయానికి పలువురు భక్తులు విరాళాలు అందించినట్లు ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. పాలకొల్లుకు చెందిన తటవర్తి సుధాకర్‌రావు, లక్ష్మి శారదదేవిలు స్వామివారికి తిరుచి వాహనం సమర్పించారు. వాడపల్లి గ్రామానికి చెందిన ఎరుబండి రాజు, సూర్యకుమారి దంపతులు విష్వక్సేనుడికి సుమారు 200 గ్రాముల వెండి కిరీటం అందించారు. తేతలికి చెందిన సోమసుందరరెడ్డి సుధా దంపతులు కిలో వెండి కిరీటం సమర్పించారు. దాతలకు ఈఓ చేతుల మీదుగా స్వామివారి చిత్రపటాలు అందజేశారు.

విశ్రాంత సైనికులకు సత్కారం

సఖినేటిపల్లి: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రామేశ్వరానికి చెందిన విశ్రాంత సైనికులు మత్తి లక్ష్మీనరసయ్య, ఎ.కృష్ణంరాజులను ఘనంగా సత్కరించారు. రామేశ్వరం పంచాయతీ వద్ద జరిగిన వేడుకల్లో ఆర్మీ విభాగంలో వేర్వేరు స్థాయిల్లో పనిచేసిన వారిని సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ దొంపాటి అన్నపూర్ణ సత్కరించారు. కాగా 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో మత్తి లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు. ఆర్మీ ఆయుధ వ్యవస్థలు, పరికరాల రూపకల్పనలో ఆయన సేవలందించారు.